## సంక్రాంతి కథల పోటీలో రు. 116/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

*నాణెం ఎగరవేస్తే బొమ్మ రావడమూ బొరుసు రావడమూ సహజమైనట్లు, ఎదురు తిరగడమూ, నోరెత్తకుండా వుండటం రెండూ సహజంగా కనిపించే ఈ జీవితం ఏమిటి? కళ్ళెదుటవుండీ అర్థంకాని ఈ 'మిస్టరీ' ఎవరు చేస్తున్నట్లు?*

**రోజూ అలవాటున్నదారే రామారావుకి అది. రామారావుకి ఆ దారిలో రోజూ కనపడేవి....కొన్ని తెలిసున్న ముఖాలు. అయిదారుకొట్లు మరికొన్ని తోపుడు బళ్ళు....చివర్న ఆ పార్కు.**

సిటీలోని చాలా బిజీ సెంటర్లలో అదొకటి. ఆ సెంటర్లో త్రిభుజాకారంలో వున్న ఆ పార్కుని చూస్తూ చాలాసార్లు...."ఏమిటీ పార్కు యిలా ట్రేంగ్యులర్‌గా ఎబ్బెట్టుగా వుందీ..." అనుకున్నాడు రామారావు.

చిన్న సైజు తుప్పల్లాంటి పదిహేను, యిరవై క్రోటన్ మొక్కలు. తిన్నగా పెరిగీ పెరగని గడ్డి. ఒకే ఒక పెద్ద పోక చెట్టు. కదలకుండా పాతేసిన సిమ్మెంటు బెంచీలు! నిజానికి అది పార్కు కాదు మూడువేపులా పిట్టగోడ కట్టి బంధించిన స్థలం.

ఆ పార్కు నలుచదరంగా వున్నా, త్రిభుజాకారంలో వున్నా రామారావుకి అది అంత అవసరమైన విషయం కాదు. అవసరం లేకపోయినా రోజూ చాలా విషయాలు రామారావు కళ్ళలోపట్టం. ఏవేవో ఆలోచనలు రావటం అలవాటైపోయింది.

రోజూలాగే ఆ దారి చివరికి, ఆ పార్కు దగ్గరికి వచ్చాడు రామారావు.

శీతాకాలం చీకటి ఆ పార్కులోకి, పార్కు చుట్టుపక్కలకీ మామూలుకన్నా తొందరగా వచ్చేస్తోంది. పార్కు పిట్టగోడకి ఆనుకుని మామూలుగానే బస్ కోసం నిలబడ్డాడు రామారావు. రోజూ కనిపించే దృశ్యాలన్నీ ఆహ్వానించాయి. పార్కు గేట్‌కి ఓ పక్క మిరపకాయ బజ్జీలబండి. మరో వేపు జిలేబీబండి.... ఎదురుగా లాటరీ టిక్కెట్ల కొట్టు. దాని పక్కన అరటిపళ్ళు. యాపిల్ పళ్ళూ అమ్ముతూ బళ్ళూ....పార్కుకి ఓ పక్కగా నిలబడ్డ పార్వతి. సరోజ.

వాళ్ళపేర్లు పార్వతి. సరోజ అవునో కాదో రామారావుకి తెలియదు. క్రమం తప్పకుండా ప్రతిరోజూ వాళ్ళని అక్కడ చూసి, చూసి తన కల్పనా చాతుర్యంతో రామారావే పెట్టుకున్నాడు ఆ పేర్లు. ఇద్దరి వయసూ ముప్పై దరిదాపుల్లోనేవుంటుంది. ఇద్దరిలో ఒకళ్ళు లావు, మరొకరు సన్నం.

అందరు ఆడాళ్ళు సహజంగా ఎడం భుజం మీదికి పైటకొంగు వేసుకుంటే రామారావు లావు పార్వతి మాత్రం పైట కుడి భుజం మీదికి వేసుకుంది. అది కులాచారమో. ఏమోకాని అందువల్ల నలుగుర్లోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆమె పక్కన వుండటంవల్ల కాబోలు సరోజా కొట్టొచ్చినట్టే కనిపిస్తుంది. సాయంత్రం అయ్యేసరికల్లా బేరాల కోసం ఆ పార్కు పరిసరాలని తమ ఆకలి చూపులతో గాలిస్తుంటారు వాళ్ళిద్దరూ. ఇద్దరూ ఎప్పుడూ నవ్వుతూనే కనిపిస్తారు. హావభావాలు దూరానికూడా తెలిసేలా పెదాలు, బుగ్గలూ కదుపుతూ మాట్లాడుతూనే వుంటారు. కొత్తలో వాళ్ళని బాగా కుతూహలంగా చూసేవాడు రామారావు. మనసులోనూ, నాలుగు గోడలమధ్య ఒంటరితనంలోనూ తప్ప ఆరుబైట, అందర్లో దిగులుగా కనపట్టమేమిటో మరిచిపోయిన మనుషుల్లా ఎప్పుడూ నవ్వుతూనే కనిపించే వాళ్ళని చూస్తుంటే దిగులుగా, కడుపులో యిబ్బందిగా వుండేది. రాను రాను అదీ తగ్గింది. ఇప్పుడు మిరపకాయ



బజ్జీల బండి, జిలేబీ బండి, పళ్ళకొట్ల వేపు చూసినట్టే వుంటుంది వాళ్ళ వేపు చూసినా.

వాళ్ళమీంచి చూపు మార్చాడు రామారావు. పార్కులో చెదురు మదురుగా రకరకాల జనం వున్నారు. ఎవరిమీదా నిలవని రామారావు చూపు ఆ బెంచీ దగ్గర ఆగింది ఆ సిమెంట్ బెంచీమీద మళ్ళీ ఆ మనిషే....ఇవాళ నాలుగో రోజు. వరసగా మూడు రోజుల్నించీ కనిపిస్తున్నాడాయన. మొదటి రోజు కనిపించినప్పుడే రామారావు చూపుల్ని పట్టుకున్నాడాయన.

ఎండిపోయిన సిమెంటురంగులో ఆ చిన్న పార్కులో ఆ పెద చెట్టు ఒక్కటే చాలా ఒంటరిగా వుంటుంది. సరిగ్గా దాని పక్కనే సిమెంట్ బెంచ్.... ఆ బెంచ్ మీద ఆ వ్యక్తి.... నాలుగు రోజుల క్రితం మొదటి సారి అదే బెంచీ మీద కనిపించాడాయనరామారావుకి అరవై ఏళ్లుంటాయి. ఎర్రటి మనిషి.... లుంగీలా కట్టుకున్న ఖద్దరు పంచె, గతకాలం దాన్లావున్న లాల్చీ. మోచేతికింద గుడ్డల మూట.... చెదరిన తెల్లటి జుట్టు. ఆ ఒంటరి చెట్టుకింద చాలా ఒంటరిగా కనిపించాడు రామారావుకి. యివాళా అలాగే వున్నాడు. చెట్టుకి ఆనుకుని కూచుని బీడీ కాల్చుకుంటున్నాడు.

భారీ మనిషే.... కానీ పటుత్వం తగ్గిన వొళ్ళు. దిగులూ బాధా నిండిన ముఖాలు రోజూ ఆఫీసులోనూ, బైటాచాలా చూస్తున్నాడు రామారావు. కానీ ఈయన ముఖంలో దిగులూ, బాధే కాకుండా యింకా ఏదో వున్నట్లు అనిపించింది రామారావుకి.

కొన్ని కళ్ళెదురుగా కనిపిస్తూనే ఓ పట్టున అర్థం అవవు ఆయన ముఖం ఆయన ముఖంలో భావం అలాగే వున్నాయి రామారావుకి.

ప్రత్యేకత ఆయన ముఖంలో వుందో, లేక ఒంటరి చెట్టుకింద బెంచీమీద అలా

ఆయన అలవాటైన సినిమా సెట్టింగ్‌లా కూచోటంలో వుందోకూడా రామారావుకి తెలియదు. రామారావు నిలబడ్డ చోటుకి. ఆయన కూచున్న బెంచీకి మధ్య దూరం వంద గజాలు మించి లేదు.

గత నాలుగు రోజుల్లో రామారావు ఆయనవేపు చూస్తుండగా ఆయనా ఏడెనిమిదిసార్లు రామారావు వేపు చూశాడు. అలా చూపులో కలిసిన సందర్భాలలో "వెళ్ళి పలకరిస్తే" అని అనిపించింది రామారావుకి. తగినంత అవసరం, గట్టి



# కనుమరుగు

పి. రాజారామ మోహనరావు

ప్రేరణలేక చూపుల దగ్గరే ఆగిపోయాడు.

పార్క్ గేట్ దగ్గర ఆరంభమైన కలకలం ఆయన బెంచీ దాకా రావటానికి ఎంతోసేపు పట్టలేదు. రామారావు చూస్తూనే వున్నాడు. వచ్చింది ముగ్గురే. ఇద్దరు ముందున్నారు. మరొకతను కొంచెం పక్కగా వున్నాడు. ముందు ఇద్దరి చేతిలో లాఠీలున్నాయి. ఆ ముగ్గురి రాక ముప్పై మంది సందడి పుట్టించింది పార్క్‌లో. గేట్ దగ్గరి మిర్చీ బండిని. జిలేబీ బండిని పంపించేశారు. పార్క్‌లో ఓ పక్కగా పేకాడుతున్న నలుగురిని లేవగొట్టారు. సరోజిని, పార్వతిని వెళ్ళమన్నట్టు చేతితో సౌంజ్ఞ చేశారు ఈ హడావుడికి కొంత మంది తమంతతామే లేచి వెళ్ళారు.

ఆయన వున్న చోటికి వచ్చి లాఠీతో సిమెంట్ బెంచీమీద కొడుతూ .... "ఓ పెద్ద మనిషీ....లే....లే...." అన్నాడు ముందున్న యిద్దరిలో వొకతను.

"ఏం....ఎందుకూ?" అన్నాడాయన బీడీ పారేసి సర్దుకూర్చుంటూ.

"అవన్నీ యెందుకయ్యా....లేచి వెళ్ళిపో...." అన్నాడు రెండో అతను. రెండోఅతని గొంతు వినగానే అతని ముఖాన్ని పరికించి చూశాడు రామారావు. తెలిసున్నవాడే....భిక్షపతి. అక్క డికి

ఫర్లాంగు దూరంలోవున్న పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ ....పైగా రామారావు యింటి ప్రాంతాల్లోనే వుంటాడు. డ్రస్సులో లేదు కానీ ముందున్న యిద్దరు లాఠీ వ్యక్తులు పోలీసులని అప్పుడర్థమైంది రామారావుకి.

"మర్యాదగా చెపుతుంటే ఏందోయ్.... ఏషాలు.... లే.... లే.... యిదేవన్నా నీ బాబు చోటేంటి...." అన్నాడు వాళ్ళిద్దరి వెనగ్గా వున్న నల్లమనిషి. అంతమేకాదు.. ఆయన చేతి కిందున్న బట్టల మూటని వో గుంజు గుంజి కింకపారేశాడు.

"ఏంటయ్యా రౌడీతనం? యిది పబ్లిక్ పార్కు. నీ యిల్లు కాదు. నేను పబ్లిక్‌లో ఒకణ్ణి...." అంటూ లేచి ఆ ముసలాయన కిందపడ్డ మూట తీసుకుని తిరిగి కూచున్నాడు.

"లేరా బాడఖావ్. చెపితే తెలియటంలా" అంటూ ఆ నల్లటి మనిషి ఆయన రెక్క పట్టుకుని లేవదీసి ఓ తోపు తోశాడు. ఆ తోపుకి చెట్టుమీద పడ్డాడు ముసలాయన. పెదవిచిట్లి రక్తం కారటం మొదలైంది. చెదిరిన జుట్టు మరింత చెదిరింది. బలహీనమైన ఆయన వొళ్ళు దెబ్బకి కొంత, ఆవేశానికి కొంత వణకటం ఆరంభించింది.

గబగబా జనాభా చేరారు. చుట్టూ పిట్టగోడదాటి రామారావు పార్కులోకి వెళ్ళాడు.

"నేనిక్కడేకూర్చుంటాను. నేవెళ్ళను. ఎందుకెళ్ళాలి...." అంటూ మళ్ళీ బెంచీ వేపు రాబోయాడు ముసలాయన ....నల్లటి మనిషి మరోతోపు తోశాడు. తిరిగి లేచిన ముసలాయన విజృంభించాడు. ఆయనకి ఏదో నచ్చచెబుదామని ముందుకి కాలేయబోయిన రామారావుకి కాలు కదల్లేదు ఆయన ప్రతిమాట...ప్రతితిట్టూ ఓ బల్లెంపోటులా వుంది.

"ఒరే వెధవా. నేను ముసలాణ్ణిరా.... ఒంట్లో ఓపిక లేనివాణ్ణి. మృగంలా మీద పడితోస్తే తోయి, కొడితే కొట్టు. అయినా నేను యిక్కడ్నుంచి కదలను. ఎందుకు కదలాలి? అసలెందుకీ పబ్లిక్ పార్కు. అలసినవాళ్ళు విశ్రాంతి తీసుకోటానికి. సేద తీరటానికి. నలభై ఏళ్ళు చాలీచాలని బతుకుతో గొడ్డు చాకిరీ చేశాను. పూర్తిగా అలిసిపోయాను. కన్న కొడుకు చూడలేదంటే....జీవితంలో అన్నీ చంపుకుని యిలా నా బతుకు నేను బతుకుతున్నా.... ఎందుకురా నన్నింకా వాగించటం.... చంపేస్తే చంపెయ్యి....కానీ నేను కదలను...." అన్నాడాయన తిరిగి బెంచీ చివర కూచుంటూ ....విపరీతంగా ఆయాసపడుతున్నాడు.... మధ్యలో దగ్గుతున్నాడు.

"అమ్మో.... ముసలాడు గట్టాడురోయ్...." అన్నారు గుంపులోంచి యెవరో.

ఎవరూ ఏం చెయ్యకపోయినా.. గోలగోలగా వుంది. పరిస్థితి అదుపు తప్పేలా వుందని గ్రహించారు లాఠీ వ్యక్తులు. ఇంత హడావిడిలోనూ బిక్షపతి, రామారావు ముఖం ముఖం చూసుకున్నారు.

"ముసల్నాకొడకా...." అంటూ విసురుగా ముందుకి రాబోతున్న నల్లమనిషిని లాఠీ అడ్డుపెట్టి ఆపాడు బిక్షపతి.

ఆపి, "చూడయ్యా ఎందుకు ఈ గొడవంతా. వెళ్ళమని చెప్పినప్పుడు వెళ్ళిపోతే పోలా. నువ్వే కాదు. చూడు పార్కులో అందరూ వెళ్ళిపోయారు...." అన్నాడు. మొదటి లాఠీ మనిషి.

"అందరూ వెళితే వెళ్ళారు. అయినా నేనేం తప్పు చేశాను చెప్పు. ఎవర్నైనా తిట్టానా, కొట్టానా, దొంగతనం చేశానా, న్యూసెన్స్ చేశానా. నా దారిన నేను కూచున్నాను. చెప్పండి బాబూ....యింత మంది చూస్తున్నారు. మీరేనా చెప్పండి... ఏం తప్పు చెయ్యని నా మీద యిలా దౌర్జన్యం చెయ్యటం యేమేనా బావుందా చెప్పండి ....ఇప్పుడు యిక్కడ్నుంచి లేచి వెళ్ళాలన్నా.... వెళ్ళే వోపికలేదు. ఎవరో ఒకరు చెప్పండి బాబూ...." అన్నాడు.

తోపులాటలో పంచె చెదిరింది, లాల్చీ కొంచెం చిరిగింది .... పెదాల పగుళ్ళల్లోంచి రక్తంకారి గడ్డం కిందదాకా కారుతోంది.

గుంపులో ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. గోల మరింత పెరిగింది. యింక లాభం లేదన్నట్టు బిక్షపతి, మరో మనిషి నల్లాడికి సైగ చేశాడు. లా అండ్ ఆర్డర్ కళ్ళు తెరిచింది. అంతే మరోక్షణంలో ముగ్గురూ కలిసి ఆ ముసలాయన్ని మూటతోసహా బరబరా పోలీస్ స్టేషన్ వేపు లాక్కుపోయారు.

పది నిముషాల్లో పార్కు ఖాళీ అయిపోయింది. నెమ్మదిగా పిట్టగోడదాటి తన మామూలు చోటుకి వచ్చాడు రామారావు.

వేసవికాలపు వానజల్లులా జరిగిందంతా కొద్ది క్షణాల్లో కనుమరుగైనా విషయం మరుపురావటంలేదు రామారావుకి.

బాధ బరువు, నిస్త్రాణే కాదు. అన్ని రకాలుగా అలసిన ముసలాయన రూపం వ్యక్తిగతంగా అన్నీ నశించి తెగింపుకి చేరిన ఆయన గొంతు. అసలు సిసలైన ఆయన ప్రొటెస్ట్ కళ్ళముందే కదులుతున్నాయి. తిరిగి బాధ .... సంబంధం లేకపోయినా రోజూ కళ్ళబడే చాలా వాటికి కలిగే బాధ, ఏం చెయ్యలేకపోయినా బాధ.. సరైన తిండీ విశ్రాంతి లేనివాళ్ళు.. ఈ వొక్క రోజేనా బావుంది అన్న తృప్తిలేని వాళ్ళు.... అరుగుల మీద, రోడ్ల మీద, మురిక్కాలవల పక్కనా జీవితం గడిపేస్తున్న లక్షల మంది జనం.

సంబంధం లేదనుకుంటూ, రోజూ యివన్నీ చూస్తూ ఆఫీసులోనూ, బైటా రోజూ అన్ని రకాలుగా అన్యాయాన్ని సహిస్తూ నోరు మెదపకుండా బతకటమే తెలివైన జీవితం అనుకుంటూ రోడ్డుమీద జనాన్ని పార్కులో తుప్పల్ని చూసినంత కేజువల్‌గా జీవితాన్ని చూస్తూ ....బతికెయ్యటం.

అలజడిగావుంది రామారావుకి. ఆ అలజడిలోనే యింకా తన ఊళ్ళో ప్రయివేట్లు చెప్పి తంటాలు పడుతున్న తండ్రి గుర్తొచ్చాడు. ఆయన్ని, తల్లిని, చెల్లెల్ని తన దగ్గరికి తీసుకొచ్చేస్తే బావుంటుంది. కానీ తీసుకురాలేదు. తీసుకొస్తే నగరం యిరుకైపోతుంది. తను యిరుకైపోతాడు. వాళ్ళ బతుకూ యిరుకైపోతుంది. అందుకని వాళ్ళు అక్కడే వుండాలి. తను యిక్కడే వుండాలి. గుర్తొచ్చినప్పుడల్లా బాధపడుతూండాలి. ఏమాత్రం సరిపోదు తన జీతం-యిది నేరం కాదు. అన్నింటినీ సమర్థించుకుంటూ, సర్దుకుంటూ, బతికే జీవితం ఈ మాత్రంగా వుంది. అందుకనే ఏం చూసినా, జరిగినా ఏం చెయ్యాలో తెలియనిది గిందీ కనపట్టలేదు.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

పోలీస్ స్టేషనకి తీసికెళ్ళి ఆయన్ని ఏం చేస్తారు. లాకప్‌లో పెడతారు. అక్కడ కూడా ఆయన అరిచి యెదురు తిరుగుతే నోరుమూసేవరకూ తంతారు.

సబబైందాన్ని అడగటం తన అసహాయతని గట్టిగా బైటపెట్టటమే ఆయన తప్పా? ఆయనచేసిన ఆపాటి పనికూడా తనలాంటివాళ్ళు చెయ్యటంలేదు ఎందుకు?

ఎప్పుడొచ్చాడో చూశేడు రామారావు. భిక్షపతి పక్కకివొచ్చి "హలోసార్...." అన్నాడు. ఉలిక్కిపడి పక్కకి చూసిన రామారావు కూడా.. "హలో.. హలో" అన్నాడు.

రామారావు ఏం అడక్కముందే భిక్షపతి జరిగిందానికి ఎక్స్‌పనేషన్‌లా చెప్పాడు.

"ఏం చేస్తాం చెప్పండి సార్. ముసలాయన మాట వినలేదు- జబర్దస్తీగా తీసికెళ్ళక తప్పలేదు. యిలాంటి గొడవలు జరుగుతాయని ముసల్లోణ్ణి కూడా తీసుకెళ్ళాం. లాకప్‌లో పెట్టాం. పొద్దున్నే వదిలేస్తాం లెండి. యింటి కెళ్ళేముందు యివాళయిదో లేనిపోని గొడవ... ఎవరో ఐ జి.కి కంప్లైంట్ రాశారు. ఈ పార్కులో దొంగతనాలు, ఆడాళ్ళగోల, ముష్టాళ్ళ గొడవా ఎక్కువైందని. యివాళ ఇన్‌స్పెక్షన్ వుంటుందని మా అనుమానం. అందుకే ఈ హడావిడి. మా అంత దరిద్రపు ఉద్యోగం ఇంకోటి లేదండీ. కొంపాగోడు, దిక్కూమొక్కూ లేని లావారిస్‌గాళ్ళు ఎందరో. ఏదో రాత్రి పడుకుంటార్లే అని వదిలేస్తే ఆ గోల.... తప్పనిసరై యాక్షన్ తీసుకుంటే ఈ గోల...." అన్నాడు.

ఇందాకటి ముసలాయన ప్రొటెస్ట్ ఎంత సబబైందని అనిపించిందో యిప్పుడు భిక్షపతి మాటలూ అంత సబబుగానే తోచాయి రామారావుకి.

ప్రొటెస్ట్ సబబే... నోరు మూసుకు బతకటం సబబే.... తల్లీ తండ్రిని తీసుకు రాకపోటం సబబే....తీసుకు రావాల్సిన అవసరం సబబే. ఇలా పరస్పర విరుద్ధమైనవన్నీ సబబే అనిపించే జీవితం.... ఈ జీవితాన్ని గొప్ప తెలివిగా. రూల్ ప్రకారంగా నియంత్రిస్తున్న శక్తి రామారావు కళ్ళెదురుగానే వున్నా విషయం కనుమరుగ్గానే వుంది. అసలు కీలకం ఎక్కడుందో చాలా మందికి అర్థంకానట్టే రామారావుకీ అర్థం కావటం లేదు.

పార్వతి, సరోజ వ్యవహారం పాతబడినట్టే. ఈ ముసలాయన వ్యవహారం పాతబడిపోతుంది. ఎటొచ్చీ రోజులతేడా. అంతే. సగటు మనిషిమీద ఏ ప్రభావం బలంగా నిలవనివ్వకుండా, అన్నింటినీ మరిపించే జీవితం మధ్య నిలబడి ఎదురు చూస్తున్నాడు రామారావు.


# 20% ప్రత్యేక సంక్రాంతి రిబేటు

ఈ రోజే కొనండి - ఆదా చేసుకొండి




దేశం నలుమూలల నుంచి ఎంచి ఎంచి తీసుకువచ్చిన చేనేత వస్త్రాలు ఎన్నో మీ ముందు ఉన్నాయి. బనారస్, ధర్మవరం, ఆరణి, బెంగాల్ కాశ్మీర్, కంచిపురం తదితర చోట్ల మంచి సిల్కు, కాటన్, ఆడ్ మిక్చర్ చీరలు, మీ కుటుంబ సభ్యులందరికి రకరకాల రెడీమేడ్ దుస్తులు, అలంకరణ వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్ తువ్వాళ్ళు, ఊలు దివాసీలు, రగ్గులు, స్త్రీ పురుషుల శాలువలు హేండ్‌లూం టెరికాట్, టెరిన్ సూటింగ్స్‌షర్టింగ్లు మరియు దుప్పట్లు అంతెందుకు, చేనేత వస్త్రాలలో ఏది కావాలంటే అది లభిస్తుంది.

## హేండ్‌లూం హౌస్

(భారత ప్రభుత్వము ఆధ్వర్యాన) (పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడినది)

మాచాని సోమప్ప భవన్, గాంధీ భవన్ ప్రక్కన

నాంపల్లి, హైదరాబాద్-1 ఫోన్: 50252

షోరూమ్ పని వేళలు : ఉ॥ 10 నుంచి రాత్రి 8 గంటల వరకు

విరామం లేకుండా

ఒక్క 27-12-81 తేది తప్ప ఆదివారము తెరచియుండును